

అచ్యుతాపురం సెజ్ ఘటనలో కాకినాడ యువతి మృతి

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో కాకినాడ యువతి మృతిచెందింది. కాకినాడ 2వ డివిజన్ సౌజన్యనగర్‌కు చెందిన చల్లపల్లి హారిక (22) ఫ్యాక్టరీలో కెమిస్ట్‌గా పనిచేస్తోంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం కాకినాడ వచ్చి పెదనాన్న కుమారులకు రాఖీ కట్టి ఆనందంగా గడిపింది. బుధవారం తెల్లవారుజామున కాకినాడ నుంచి బయలుదేరి అచ్యుతాపురం వెళ్లింది. విధి నిర్వహణలో ఉండగా రియాక్టర్ పేలిన దుర్ఘటనలో హారిక మృతిచెందిందన్న వార్త విన్న తల్లి అన్న పూర్ణ, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కౌలు రైతులందరికీ పంట రుణాలివ్వాలి

ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్, ఆగస్టు 21: కౌలు రైతులందరికి పంట రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం మండల స్థాయి తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 77,750 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఇప్పటి వరకు 49,460 మంది కౌలు రైతులకు కార్డులు మంజూరు చేశామన్నారు. కౌలు రైతులకు 7 శాతం వడ్డీతో పంట రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వర్షాల సమయంలో పంట తడిచిపోకుండా ఉపయోగపడే టార్పాలిన్లు ఎన్ని ఉన్నాయో, ఇంకా ఎంత అవసరమో అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, కోఆపరేటివ్ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధుల విడుదలకు కృషి చేయాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ద్వారా మంజూరైన పనులకు నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సీఎస్ఆర్ నిధులు కింద మంజూరైన పనుల పురోగతిపై ఆయా ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీస్‌తో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. 2019-20 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు కోనసీమకు సీఎస్ఆర్ ద్వారా విడుదలైన నిధులు, మంజూరైన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సీఎస్ఆర్ నిధులు కింద పనులు చేసేందుకు పరిపాలన అనుమతులు లభించి ఇప్పటి వరకు ప్రారంభంకాని పనులపై ఆరా తీశారు. సీఎస్ఆర్ కింద జిల్లాలో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు, భవనాలు, డ్రైనేజీలు, హెడ్‌వర్క్స్, తదితర శాఖల కింద 547 పనులు రూ.87.25 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారని, వీటిలో రూ.25.07 కోట్లతో 205 పనులు పూర్తయ్యాయన్నారు. రూ.26.14కోట్లతో 162 పనులు పురోగతిలో ఉన్నాయని, 180 పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదని అధికారులు తెలిపారు. తక్షణమే నిధులు విడుదల అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సీపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఈఈ కె.చంటిబాబు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ ఎం.సురేష్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ పాల్గొన్నారు.

త్వరలో పరిశ్రమల అభివృద్ధి విధానం..

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రతినిధులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్లు, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్‌లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో 2024-29 పరిశ్రమల అభివృద్ధి విధానం అమలులోకి తీసుకురానుందని ఈ పాలసీల ఏరియాలలో ఉండే సమస్యలు, సవాళ్లు, అధిగమించే అంశంపై చర్చించారు. జిల్లాలో కొబ్బరి ఎక్కువగా ఉత్పత్తి అవుతున్నందున కొబ్బరి ఆధారిత పరిశ్రమలను నెలకొల్పే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టీఎపీ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోతున్నాయ్.. ప్రాణాలు!



అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదానికి గురైన ఫ్యాక్టరీ

ప్రాణాలు పోతున్నాయి.. పోయేవి కార్మికులవే కదా.. ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఎక్కడైనా ఉన్నాయా?? అందుకే నిర్లక్ష్యం.. బతుకు పోరాటంలో భద్రతలేక ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లాలో వందలాది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.. పరిశ్రమల్లో ఎక్కడైనా ప్రమాదం జరిగితే అధికారులు అప్రమత్తమైపోతారు.. పాలకులు పరుగులు పెడతారు.. ఒకట్రెండు రోజులు హడావుడి చేస్తారు.. ఆ తరువాత షరా మామూలే.. కంపెనీల దారి కంపెనీలదే.. అధికారుల దారి అధికారులదే.. కంపెనీలు ఇచ్చే ఆమ్యామ్యాలకు కార్మికుల భద్రతను తాకట్టు పెట్టేస్తున్నారు.. ప్రత్యేకంగా జిల్లాకో పరిశ్రమల శాఖ అంటూ ఉన్నా ఏనాడు తనిఖీలు చేసిన దాఖలాలే కానరావు.. ఈజ్ ఆఫ్ డూయింగ్ మాటున తనిఖీలకు సంకెళ్లు వేయడంతో యాజమాన్యాల ఇష్టారాజ్యంగా మారింది. దీంతో కార్మికులకు భద్రతే కరువైంది.. కూటమి ప్రభుత్వ దీనిపై దృష్టి పెట్టాలి.. జిల్లాకు చెందిన కార్మిక శాఖ మంత్రి సుభాష్ ఈజ్ ఆఫ్ డూయింగ్ సంకెళ్లను తెంచి భద్రతపై భరోసా ఇవ్వాలి..

పరిశ్రమల్లో కార్మికులకు అభద్రత

- అచ్యుతాపురం సెజ్ ఘటనతో ఉలికిపాటు
- 18 మంది కార్మికుల దుర్మరణం
- ఉమ్మడి జిల్లాలో చమురు, గ్యాస్ కంపెనీలు
- ఆయా పరిశ్రమల్లో భద్రతపై భయాందోళనలు
- తూతూ మంత్రంగా భద్రత ప్రమాణాలు
- కాకినాడ చుట్టూ పేలుడు ముప్పున్న కంపెనీలు
- ప్రమాదాలు జరిగితే ప్రాణాలు గాలిలోనే
- గత ప్రభుత్వంలో భద్రతా లోపాలపై నివేదికలు
- పలు కంపెనీల్లో నిబంధనల ఉల్లంఘనలు
- ఏ మాత్రం పట్టించుకోని గత పాలకులు
- కొత్త సర్కారు తనిఖీలు చేపట్టాలని డిమాండ్లు
- ఇకనైనా మేలుకోకుంటే ముప్పే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో బుధవారం చోటుచేసుకున్న ఘోర పారిశ్రామిక ప్రమాదంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటనలో ఏకంగా 18 మందికి పైనే కార్మికులు దుర్మరణం పాలవడం పారిశ్రామికవర్గాలను కలవరపాటుకు గురిచేస్తోంది. తాజా ఘటనతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల్లో డొల్లతనం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అరకొర భద్రత మధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికుల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పును ఈ దుర్ఘటన మళ్లీ ప్రశ్నిస్తోంది.

జిల్లాలో ఎన్నో పరిశ్రమలు..

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలు అనేక రకాల పరిశ్రమలకు పెట్టింది పేరు. ముఖ్యంగా కాకినాడ జిల్లా కేంద్రాన్ని ఆనుకుని నగరం చుట్టు పక్కల వందలాది చమురు,రసాయన కంపెనీలున్నాయి. ఇవన్నీ కాకినాడ పోర్టు ద్వారా విదేశాల నుంచి రకరకాల రసాయనాలను దిగుమతి చేసుకుంటాయి.ముఖ్యంగా చమురు పరిశ్రమలైతే విదేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుని బాయిలర్లలో ద్వారా శుద్ధిచేసి అనేక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తాయి. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పారిశ్రామికవాడల్లో పతంజలి, లోహియా ఎడిబుల్ ఆయిల్, కేపీఆర్ ఆగ్రో, శ్రీసాయి ఆయిల్ ఫీల్డ్, శ్రీకాకినాడ ఆక్సిజన్ గ్యాసెస్ ప్రైవేట్ లిమిటెడ్, పట్టాభి ఆగ్రో, ఆపెక్స్ ఫ్రోజెన్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐవోసీ, ఐవోసీఎల్, సంహిత స్టోరేజ్,భారత్ ఎంటర్‌ప్రైజెస్, అదాని ఆగ్రో ఆయిల్, ఎన్ఎఫ్‌సీఎల్, కోరమండల్ వంటి పరిశ్రమలు పనిచేస్తున్నాయి. సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లోను సిరామిక్, ఆగ్రో, ఆక్వా, టైల్స్ తయారీ వంటి పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులు నిరంతరం పనిచేస్తుంటారు. వీరిలో జిల్లాతోపాటు బిహార్, యూపీ, ఒడిషా తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు అధికంగా పనిచేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రసాయన, ఆగ్రో, కోనసీమలో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు, పైపులైన్లు అధికంగా ఉన్నాయి. ఈ పరిశ్రమలు, పైపులైన్లకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలకు దిక్కులేకుండా పోతోంది. తాజాగా బుధవారం పక్కనే ఉన్న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాద ఘటనతో ఉమ్మడి జిల్లాలో గతంలో జరిగిన పారిశ్రామిక ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. కోనసీమ జిల్లాలోని అనేక మండలాల్లో అప్పుడప్పుడు గ్యాస్ పైపులైన్లు లీకై ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నాయి. రామచంద్రపురం, మండపేట, అనపర్తి నియోజకవర్గాల్లోని ఆయిల్,ఆగ్రో పరిశ్రమల్లోను తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అనధికారికంగా తయారుచేసే మందుగుండు పరిశ్రమల్లో ఏటా ఇరవై మందికిపైగా చనిపోతున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో పలు పరిశ్రమల్లో ఎక్కడో ఒక చోట ఏదొక ప్రమాదం జరుగుతూనే ఉంది.ముఖ్యంగా వాకలపూడిలో ఉన్న ఆయిల్ పరిశ్రమలో భద్రత ప్రమాణాలు పాటించడం లేదని ఏడాదిన్నర కిందట అధికారులు తేల్చారు. ఇందులో గనుక ప్రమాదం జరిగితే నగరంలో అర కిలోమీటరు మేర దాని ప్రభావం ఉంటుందని గుర్తించారు. అయినా గత వైసీపీ సర్కారు ప్రమాదాలు పొంచి ఉన్న పరిశ్రమల విషయంలో పెద్దగా చర్యలు తీసుకున్న పాపానపోలేదు. ఆయా కంపెనీల నుంచి మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇప్పించామని గొప్పలు చెప్పడం, ఆ ముసుగులో కంపెనీలను బెదిరించి తాము కొంత దండుకోవడం మినహా కార్మికుల భద్రతకు గట్టిగా వ్యవహరించలేదు.

నాడు లోపాలు గుర్తించినా..

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదం తరహా ఘటనలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గడిచిన కొన్నేళ్లలో అనేకం చోటుచేసుకున్నాయి. ప్రధానంగా 2021లో కాకినాడలో సర్పవరం టైకీ రసాయన పరిశ్రమలో బాయిలర్ పేలిన ఘటనలో ఇద్దరు సజీవ దహనమయ్యారు. ఆ తర్వాత 2022లో ప్యారీ షుగర్స్ ఫ్యాక్టరీలో జరిగిన వరుస ప్రమాదాల్లో ఐదుగురి దేహాలు నుజ్జునుజ్జయ్యాయి. గతేడాది మార్చిలో పెద్దాపురం అంబటి ఆయిల్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఏకంగా ఏడుగురు కార్మి కులు దుర్మరణం చెందారు.అలాగే 2014 జూన్‌లో కోనసీమలోని నగరంలో గెయిల్ గ్యాస్‌పైపులైన్ పేలుడులో 15 మంది దుర్మరణం పాలయ్యారు. ఇలా అనేక ప్రమాదాల్లో ఎందరో చనిపోయారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలోని ఎల్జీపాలిమర్స్ గ్యాస్ లీకు దుర్ఘటన జరగడంతో 2020 మేలో ప్రభుత్వం అన్ని జిల్లాల్లో పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల డొల్లతనంపై తనిఖీలకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోను అప్పటి జేసీల నేతృత్వంలో ఫ్యాక్టరీలు, పరిశ్రమలు, ఫైర్, కాలుష్య నియంత్రణ బోర్డు తదితర శాఖలతో కూడిన అధికారుల బృందం జిల్లాలోని పరిశ్రమల్లో భద్రత లోపాలు, ప్రమాదాలు జరిగితే ప్రాణ నష్టం నివారించే వ్యవస్థలు ఉన్నాయో లేవో తనిఖీలు చేసింది. ఇరవై అంశాల్లో తనిఖీలు చేసి నివేదికలు తయారు చేశారు. ఇందులో పలు పరిశ్రమలు ప్రమాదాల నివారణకు కనీస చర్యలు తీసుకోవడం లేదని గుర్తించారు. కోనసీమలో అనేక గ్యాస్ పైపులైన్ల ద్వారా పొంచి ఉన్న ముప్పును గుర్తించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సర్కారుకు సిఫార్సులు చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం ఆ తర్వాత నివేదికలను గాలికొదిలేసింది. గతేడాది పెద్దాపురం అంబటి ఆయిల్ ఫ్యాక్టరీ దుర్ఘటన తర్వాత ఉమ్మడి జిల్లాలో అనుమతులు లేని, భద్రత చర్యలు పాటించని కంపెనీల పైనా తనిఖీలు చేపట్టారు. ఇందులో కొన్ని అత్యంత ప్రమాదకర కంపెనీలను గుర్తించారు. వీటిలో కార్మికుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని నిగ్గుతేల్చారు. కానీ ఆ కంపెనీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దాంతో పరిస్థితి మొదటికొచ్చింది.

కొత్త ప్రభుత్వం మేల్కొనాలి..

అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన దుర్ఘటనను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వం పరిశ్రమల్లో భద్రత వ్యవహారాలను మరింత పెంచేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. జిల్లాలో అత్యంత ప్రమాదకర పరిశ్రమల్లో పొంచి ఉన్న ప్రమాదాలు, తీసుకోవాల్సిన భద్రత చర్యలు, పేలుళ్ల నివారించడానికి ఆయా కంపెనీల సన్నద్ధత ఏ విధంగా ఉందో పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఫ్యాక్టరీలు, పరిశ్రమల్లో ప్రమాద నివారణ వ్యవస్థలు, మాక్‌డ్రిల్స్ జరుగుతున్నాయా? లేదా? రియాక్టర్లు, బాయిలర్స్ పేలుడు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మరింత అప్రమత్తత ఏ స్థాయిలో ఉందో సమీక్షించాల్సిన అవసరం ఏర్పడింది.



అనపర్తి శ్రీచక్ర ఆయిల్స్‌లో ప్రమాదం (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రమాదాలు

- అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన తరహా ప్రమాదం 2021లో కాకినాడ నగరం సర్పవరం టైకీ రసాయన పరిశ్రమలో జరిగింది. బాయిలర్ పేలిన ఘటనలో ఇద్దరు సజీవ దహనం కాగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- 2022 ఆగస్టు 19న కాకినాడను ఆనుకుని ఉన్న ప్యారీ షుగర్ ఫ్యాక్టరీలో విస్ఫోటనం చోటుచేసుకుంది. లోపల బాయిలర్ పేలడంతో ముగ్గురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు.తిరిగి ఆగస్టు 29న ఇదే ఫ్యాక్టరీలో రెండోసారి మూడో అంతస్తులో యంత్రం నుంచి ఓ పైప్ కింద పడిపోవడంతో ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు.
- గతేడాది అంటే 2023 ఫిబ్రవరి9న పెద్దాపురం అంబటి ఆయిల్ పరిశ్రమలోఇరవై అడుగులకుపైగా ఎత్తున పొడవాటి ఆయిల్ ట్యాంకులోకి శుభ్రం చేయడానికి దిగి మడ్డిలో ఇరుక్కుని దుర్మరణం పాలయ్యారు.
- 2014లో కోనసీమలోని నగరంలో గెయిల్ పైపులైన్ పేలుడు ఘటనలో 15మంది దుర్మరణం పాలయ్యారు.
- 2019లో తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో శ్రీచక్ర ఆయిల్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో రూ.25 కోట్లు నష్టం వాటిల్లింది. ప్రాణనష్టం సంభవించలేదు.
- 2022లో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారు కొండగూడెంలో ఉన్న విజన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు.

పాశర్లపూడిలంక వాసి మృతి



మామిడికుదురు, ఆగస్టు 21: అనకాపల్లిలో ఫార్మా కంపెనీలో బుధవారం మధ్యాహ్నం జరిగిన పేలుడు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలంక గ్రామానికి చెందిన మారిశెట్టి సతీష్ (31) మృతిచెందినట్టు సమాచారం. నాలుగేళ్లుగా సతీష్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడికి మూడేళ్ల క్రితం సాయిశ్రీ వినాయక దుర్గా వెంకట నాగమణితో వివాహమైంది. సతీష్ తండ్రి శ్రీను కొబ్బరి పీచుతో మ్యాట్‌లు తయారుచేసి విక్రయిస్తుంటాడు. తల్లి పద్మావతి గృహిణి. సమాచారం తెలియడంతో తల్లిదండ్రులు, భార్య ఇక మాకు దిక్కెవరంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



అమలాపురం డీఎస్పీగా టీఎస్ఆర్‌కే ప్రసాద్

అమలాపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం డీఎస్పీగా టీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను నియమిస్తూ డీజీపీ కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్నారు. ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను అమలాపురం డీఎస్పీగా బదిలీ చేశారు. గతంలో ఈయన రామచంద్రాపురం డీఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం అమలాపురం డీఎస్పీగా పనిచేసిన మహేశ్వరరావును కేంద్ర హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.



ఏర్పాట్ల పరిశీలనలో అధికారులు, ఎమ్మెల్యే

రేపు వానపల్లికి సీఎం చంద్రబాబు

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

7లో



అమలాపురంలో నాయకుల నిరసన ప్రదర్శన



రాయవరంలో జైభీమ్ యూత్ సభ్యుల నిరసన

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా.. బంద్ ప్రశాంతం

దుకాణాలు, విద్యాసంస్థలు మూసివేత

నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసులు

అమలాపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం మాలలు చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది.. జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న అన్ని విద్యా సంస్థలకు ఆయా యాజమన్యాలు సెలవు ప్రకటించాయి. అమలాపురం, రామచంద్రాపురం, రాజోలు, రావులపాలెం డిపోల పరిధిలోని ఆర్టీసీ బస్సు సర్వీసులన్నింటిని ఆందోళనకారులు వేకువజామునే నిలిపివేశారు. మాలమహానాడుకు చెందిన కార్యకర్తలు, నాయకులు ఎక్కడికక్కడే డిపోల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అమలాపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, గడియార స్తంభం సెంటర్, వై జంక్షన్ల వద్ద ప్రధాన రహదారులపై నిరసన కారులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని దళితులు నినాదాలు చేశారు. పట్టణాలలో ఉన్న వర్తక, వాణిజ్య వ్యాపార సంస్థలన్నింటిని ఆందోళనకారులు గుంపులుగుంపులుగా తిరుగుతూ మూయించివేశారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు బ్యాంకులను సైతం మూయించివేశారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని మాలమహానాడు కార్యకర్తలు ప్రకటించారు. ముందు జాగ్రత్తగా అమలాపురం పట్టణంలోని వివిధ కూడళ్లలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బస్సులు, ఆటోలు తిరగకపోవడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మాల మహానాడు జేఏసీ నేతలు ఏఎంకే భీమారావు, ఉంగ్రు బాబ్జి, పెయ్యిల పరశురాముడు, చీకురుమిల్లి కిరణ్‌కుమార్, జల్లి శ్రీనివాసరావు, చింతా రామకృష్ణ, నాతి శ్రీనివాసరావు, నక్కా సంపత్ కుమార్, ఉంగ్రు వెంకటేష్, మెండు రమేష్‌బాబు, పెనుమాల చిట్టిబాబు, గుబ్బల శ్రీను, గూటం సాయి, పోతుమూడి రవికుమార్, జంగా రాజేంద్రకుమార్ తదితరులు నాయకత్వం వహించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసులు ఎక్కడికక్కడే పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



మండపేట: కేశవరంలో రాజమండ్రి-విశాఖ పాసింజర్ వద్ద ఆందోళనకారులు

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం

కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున..

8లో

రేపు వన్నెచింతలపూడిలో అంతరిక్ష దినోత్సవం

జిల్లా స్థాయిలో నిర్వహణ: డీఈవో

8లో

ఉద్యోగోన్నతులు రద్దు

- 17 మందికి గ్రేడ్-1 వీఆర్వోలుగా రివర్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన కాకినాడ జిల్లా కలెక్టర్

చింతూరు, ఆగస్టు 21: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రెవెన్యూ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ సహాయకులకు గ్రేడ్-1 వీఆర్వోలుగా రివర్షన్ ఇస్తూ కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు రెండేళ్ల క్రితం జీవో నెం.154 ప్రకారం 17 మంది గ్రేడ్-1 వీఆర్వోలు సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి పొందారు. 17 మందిలో చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్లలో 14 మంది, మిగిలిన ముగ్గురు మండపేట, తుని, అయినవిల్లిల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనల మేరకు వారంతా నిర్దేశించిన కాల పరిమితిలో డిపార్ట్మెంటల్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. కాల పరిమితి పూర్తి అయినప్పటికీ వారంతా ఆ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదు. దీంతో వారందరినీ గ్రేడ్-1 వీఆర్వోలుగా (రివర్షన్) కాకినాడ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నకిలీ ఫోన్ పేతో బురిడీ

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో పద్మరాజు కిరాణా, ఫ్యాన్సీ హోల్‌సేల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఓ వ్యక్తి వచ్చి రెండు కింగ్ సిగరెట్ పెట్టెలు, ఒక ఫ్రీడం ఆయిల్ సీసా కావాలని కోరాడు. ఒక్కో సిగరెట్ బాక్స్ రూ.3,400 చొప్పున రెండింటికీ రూ.6,800, ఫ్రీడం ఆయిల్‌కి రూ.1,800 మొత్తం రూ.8,600 బిల్లు అయ్యింది చెల్లించాలని కోరాడు. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లిస్తానని చెప్పగా స్కానర్ ద్వారా నగదు చెల్లించాలని వ్యాపారి పద్మరాజు కోరాడు. స్కానర్ పని చేయట్లేదని, మొబైల్ నెంబరు చెప్పాలని కోరడంతో ఆ విధంగానే చేశాడు. ఫోన్ పే నెంబరుకు రూ.8,600 పంపినట్టు నకిలీ లావాదేవీ చూపించాడు. డబ్బులు ఇంకా అకౌంట్‌లోకి రాలేదని చెప్తున్న క్రమంలో బైక్‌పై సరుకుతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు. నకిలీ ఫోన్ పే లావాదేవీ చూపి తనను మోసం చేశాడన్న విషయాన్ని గుర్తించిన వ్యాపారి సీసీ ఫుటేజీ ద్వారా బైక్ నెంబరును గుర్తించి ఆర్టీవో కార్యాలయం ద్వారా వివరాలు సేకరించాడు. కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఉన్న క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. కొత్తపల్లి మండలం గంగోలిపేట అమీనాబాద్‌కు చెందిన వడ్డి రాజు పేరుపై ఏపీ 35జేఎం 5966 పేర బైక్ ఉన్నట్టు పద్మరాజు తెలిపాడు. దానికి పోలీసులు విధించిన జరిమానాలు కూడా పెండింగులో ఉన్నాయన్నాడు. నిందితుడిని పట్టుకుని నగదు రికవరీ చేయాలని కోరుతూ సర్పవరం క్రైం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

లింక్ ఓపెన్ చేయగానే
రూ.2.62 లక్షలు హాంఫట్

గండేపల్లి, ఆగస్టు 21: గుర్తు తెలియని నెంబరు నుంచి వచ్చిన లింక్ ఓపెన్ చేయగానే బ్యాంకు ఖాతా నుంచి రూ.2.62 లక్షలు మాయమైన ఘటనపై బుధవారం గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్ళూరుకు చెందిన పుచ్చకాయల వెంకటరమణకు గుర్తు తెలియని మొబైల్ నెంబరు నుంచి లింక్ వచ్చింది. ఆ లింక్‌పై అతడు క్లిక్ చేయగానే రూ.2.62 లక్షలు పోయినట్టు గ్రహించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు కేసు నమోదు చేయగా జగ్గంపేట సీఐ లక్ష్మణరావు దర్యాప్తు చేస్తున్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మరిడమ్మ హుండీల ఆదాయం
రూ.15.83 లక్షలు

పెద్దాపురం, ఆగస్టు 21: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని మరిడమ్మ అమ్మవారి ఆలయంలో హుండీలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బుధవారం తెరిచి లెక్కించారు. 29 రోజులకు రూ.15,83,217 సమకూరినట్టు దేవస్థానం సహాయ కమిషనరు చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మజీ, దేవదాయ శాఖ అధికారులు కాట్నం జగన్మోహన శ్రీనివాస్, చల్లా బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.



వెండి మబ్బులు

ఆకాశంలో వెండి మబ్బులు కనువిందు చేశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని టిడ్కో గృహాల సముదాయాల వద్ద బుధవారం ఉదయం పది గంటలకు కెమెరాకు చిక్కింది దృశ్యం. - మండపేట

ఇంటర్నేషనల్ స్టూడెంట్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన

జేఎన్టీయూకే, ఆగస్టు 21: జేఎన్టీయూ సెనేట్ హాల్లో ఫారన్ యూనివర్శిటీ రిలేషన్స్ (ఎఫ్‌యూఆర్) డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జేఎన్టీయూకే, యూఎస్ఏలోని సౌత్ యూనివర్శిటీ ఇంటర్నేషనల్ స్టూడెంట్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై బుధవారం ఎక్సెల్లా గ్రూప్ సహకారంతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉన్నత విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు అనేక అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. సౌత్ యూనివర్శిటీ ఇంటర్నేషనల్ మార్కెటింగ్ డైరెక్టర్ జోసెఫ్ క్యాస్ట్రో మాట్లాడుతూ 125 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన అమెరికాలోని సౌత్ యూనివర్శిటీకి రెండు క్యాంపస్‌లున్నాయని తెలిపారు. ఫ్లోరిడాలోని టంపా నగరంలో ఒకటి, జార్జియాలోని సవన్నా నగరంలో మరొకటి ఉండగా బిజినెస్ మేనేజ్‌మెంట్, సీఎస్ఈ, అలైడ్ హెల్త్‌సైన్సెస్‌ల్లో విద్యార్థులకు పలు కోర్సులు అందిస్తున్నాయన్నారు. అనంతరం సౌత్ యూనివర్శిటీ అందించే కోర్సుల వివరాలు, ట్యూషన్ ఫీజు, ఉపాధి అవకాశాలు, క్యాంపస్‌లోని సదుపాయాలను వివరించారు. ఎఫ్‌యూఆర్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎ.స్వర్ణకుమారి అధ్యక్షత వహించగా ఎక్సెల్లా ఎడ్యుకేషన్ గ్రూప్ ప్రతినిధి డి.కాంతికిరణ్, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సౌత్ యూనివర్శిటీ డైరెక్టర్ జోసెఫ్ క్యాస్ట్రో

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఖరారు



పళ్లాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఓ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు

రేపు కొత్తపేట మండలం వానపల్లి రాక

కొత్తపేట, ఆగస్టు 21: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండల పరిధిలోని వానపల్లి గ్రామంలో శుక్రవారం జరిగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం ఆయన కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావులతో కలిసి వానపల్లిలోని పళ్లాలమ్మ అమ్మ వారి ఆలయ ప్రాంగణ సమీపంలోని ప్రదేశాలను పరిశీలించారు. దీనికి సంబంధించి రూట్‌మ్యాప్ ఖరారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారన్నారు. హెలిపాడ్‌కు సంబంధించి కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. పరిశీలనలో టీడీపీ సీనియర్ నాయకులు ఆకుల రామకృష్ణ, దర్నాల రామకృష్ణ, పల్లి భీమారావు, సలాది నాగేశ్వరరావు, పల్లి ఏసు తదితరులు వున్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పిఠాపురం రూరల్ పోలీసులు

పిఠాపురం రూరల్, ఆగస్టు 21: తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు పిఠాపురం రూరల్ పోలీసులు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం జల్లూరు గ్రామానికి చెందిన బత్తిన శ్రీరామ్ (13) ఈ నెల 18వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన కుమారుడు అదృశ్యమయ్యాడని బాలుడి తండ్రి శివన్నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శ్రీరామ్ జల్లూరు నుంచి సామర్లకోట సైకిల్‌పై వెళ్లి రైల్వే స్టేషన్లో పెట్టి అక్కడి నుంచి రైలు ఎక్కినట్టు గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి బుకింగ్ కౌంటర్‌లో విచారణ జరిపి బాలుడు విశాఖ వెళ్లినట్టు గుర్తించి వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాచారం ఇచ్చారు. బాలుడు విశాఖపట్టణంలో ఉన్నట్లు గుర్తించి బుధవారం పిఠాపురం రూరల్ పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. శ్రీరామ్ ప్రైవేటు స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. తనను చదవమని ఒత్తిడి చేస్తున్నారని, తమ్ముడిని బాగా చూస్తున్నారని, అందుకే ఇంటి నుంచి వెళ్లిపోయానని శ్రీరామ్ చెప్తున్నాడు. అతడిని బుధవారం రాత్రి ఎస్ఐ గుణశేఖర్ తల్లిదండ్రులకు అప్పగించారు.



నిందితుడిని మీడియాకు చూపిస్తున్న కోరుకొండ సీఐ నాగ మురళి

బంగారం షాపులో చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

42.5 గ్రాముల బంగారం, 450 గ్రాముల వెండి రికవరీ

కోరుకొండ, ఆగస్టు 21: తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ లోని ఒక బంగారం షాపులో మార్చిలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను కోరుకొండ మండలం కాపవరం శివారులో బుధవారం అరెస్టు చేశారు. దీనికి సంబం ధించి కోరుకొండ సీఐ అడపా నాగమురళి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... మార్చి ఒకటో తేదీ అర్ధరాత్రి సమయంలో కోరుకొండ మసీదు పక్కన గల శ్రీలక్ష్మీ అయ్యప్ప బ్యాంకర్స్, బంగారం షాపులో జరిగిన దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో కాపవరం శివారులో ఉలిదిండి కిరణ్, బొమ్మోతి సుధీర్‌కుమార్‌లను అరెస్టు చేశారు. కిరణ్‌ది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరు సుధీర్‌ది కోరుకొండ మండలం పశ్చిమగోనగూడెం. వారిద్దరి నుంచి 42.5 గ్రాముల బంగారు వస్తువులు, 450 గ్రాముల వెండి వస్తువులు రికవరీ చేశారు. మరికొన్ని బంగారం వస్తువులను వరంగల్ సమీపంలోని హన్మకొండ, రాజుపేటల్లో ముత్తూట్ ఫైనాన్స్, కెనరా బ్యాంకుల్లో తాకట్టపెట్టారు. వాటిని రికవరీ చేయాల్సి ఉంది. నిందితులిద్దరూ పాత నేరస్తులు. వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన కోరుకొండ సీఐ, ఎస్ఐ, సిబ్బందిని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ అభినందించారు. వారికి రివార్డు ఇస్తారని సీఐ నాగమురళి చెప్పారు..



సంఘటనా స్థలం నుంచి ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మోటారు సైకిలును ఢీకొన్న లారీ

- ఒకరికి తీవ్ర, ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు
- ఆ మార్గంలో వెళ్తుండగా చూసి స్పందించిన కలెక్టర్
- తక్షణం వైద్య సహాయం అందించాలని సూచన

రాజానగరం, ఆగస్టు 21: పరామర్శకు వెళ్తూ మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చూసి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చలించిపోయారు. వెంటనే వాహనం ఆపి 108 అంబులెన్సుకు ఫోను చేశారు. తక్షణ వైద్య సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులకు ఫోనులో సూచించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో ఉన్న కలెక్టర్ ప్రశాంతి రాజానగరం హైస్కూలు సమీపంలో ప్రమాదంలో గాయపడి వైద్య సహాయం కోసం ఎదురుచూస్తున్న వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెద్దాపురం మండలం ఆనూరు-కొత్తూరు గ్రామానికి చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్, జి.వీరవెంకటలక్ష్మి, సీహెచ్ మసిరమ్మ మోటారు సైకిలుపై కోరుకొండ మండలం గాదరాడలోని తమ బంధువుల ఇంటికి పరామర్శకు బయల్దేరారు. ఏడీబీ రోడ్డులో రాజానగరం హైస్కూలు కూడలి వద్ద హైవే దాటుతున్న సమయంలో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ మోటారు సైకిలును ఢీకొంది. హైవేపై ప్రయాణం చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నియమాలు పాటించాలని వాహనచోదకులకు కలెక్టర్ ప్రశాంతి సూచించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై జీఎస్ఎల్ వైద్యులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.... దుర్గాప్రసాద్ తలకు బలమైన గాయాలయ్యాయని, మిగిలిన ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు అయ్యాయని చెప్పారు.



ప్రమాదానికి కారణమైన లారీ

పాము కాటుకు వ్యక్తి మృతి

కరప, ఆగస్టు 21: కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లిలో అమ్మవారి గుడి వీధికి చెందిన మరుకుర్తి సత్తిబాబు (40) స్థానిక ఆక్వా చెరువుల వద్ద పని చేస్తున్నాడు. కాగా బుధవారం మధ్యాహ్నం చెరువుల వద్ద కాపలా కాస్తుండగా విష సర్పం కరిచింది. దీంతో ఆపస్మారక స్థితికి చేరుకుని అక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుని న్యాయం చేయాలని కోరుతూ బంధువులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది. ఎస్ఐ టి.రామకృష్ణ ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

కరప, ఆగస్టు 21: కాకినాడ జిల్లా కరప మండలం పెదకొత్తూరు గ్రామానికి చెందిన దాసరి భీమరాజు (28) బుల్డోజర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 19న పనిమీద ఉప్పాడ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వాకాడ వంతెన వద్దకు వచ్చేసరికి బండి స్కిడ్ అయ్యి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన భీమరాజును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు

మండపేటలో నేడు, రేపు
అంతర్జాతీయ సెమినార్

- దేశ, విదేశాల నుంచి శాస్త్రవేత్తల రాక

మండపేట, ఆగస్టు 21: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురు, శుక్రవారాల్లో అంతర్జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలి రోజు సెమినార్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. కళాశాల చరిత్రలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సెమినార్‌కు కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనరు పోలా భాస్కర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కృష్ణ, ఆర్జేడీ డాక్టర్ శోభారాణి, కొరియా దేశానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ కె.నవీన్ కుమార్, డాక్టర్ అక్కినేపల్లి భార్గవ్, డాక్టర్ బత్తుల బాబు, డాక్టర్ చావా రామకృష్ణ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ గురుప్రకాష్ నున్న, డాక్టర్ సీతారామరాజు, యునుగనమ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలతో పాటు డాక్టర్ వర్మకవి నరేష్, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, దేశంలోని ప్రసిద్ధ యూనివర్సిటీలకు చెందిన ఫిజిక్స్ విభాగ అధ్యాపకులు హాజరవుతున్నారని ఆయన చెప్పారు. తొలిసారిగా గ్రామీణ వాతావరణంలో విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేక్ గ్రేడ్ అటానమస్ కోసం కూడా ప్రయత్నిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సెమినార్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎ.ఆనందరావు, ఎన్ఎస్‌వీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు

సెమీ సంస్థలతో అదానీకి లబ్ధి

- సీడబ్ల్యుసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21: సెమీ సంస్థల ద్వారా అదానీ సంస్థలకు లబ్ధి చేకూర్చి పెడుతున్నారని సీడబ్ల్యుసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పదేళ్లు పూర్తి చేసుకుని 11వ ఏట అడుగుపెట్టిందన్నారు. ఈ కాలంలో ప్రధాని మోదీ అనేక దేశాల పర్యటనలకు సంబంధించిన ఖర్చులపై అధికారికంగా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోదీ విదేశీ పర్యటన వల్ల ఏ లాభం జరిగిందో తెలపాలన్నారు. దేశంలో వనరులను ధారాదత్తం చేశారని, మైన్స్‌ను అంబానీ, అదానీలకు కట్టబెట్టారని ఆరోపించారు. సోలార్‌కు సంబంధించి పెద్ద స్కామ్ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాలను అమలు చేయకుండా తాత్సారం చేస్తోందన్నారు. ప్రభుత్వ శాఖల ప్రక్షాళనతో పాటు అభివృద్ధి, సంక్షేమాలపై దృష్టిపెట్టాలన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర ఇన్‌చార్జి బోడా వెంకట్, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, సీనియర్ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, అబ్దుల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి

1101 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



మోతుగూడెం, ఆగస్టు 21: డొంకరాయి జలాశయం ద్వారా బుధవారం ఉదయం 1101 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా బుధవారం ఉదయం 1036.50 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. పూర్తిస్థాయికి చేరుకుంటే గేట్లపై ఒత్తిడి పడే ప్రమాదం ఉందన్న నిపుణుల సూచనలతో జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈఈ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎగువన కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి 5,048 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. దీంతో 6వ నెంబరు గేటును ఒక అడుగు పైకెత్తి దిగువకు 1101 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నీటిమట్టం ప్రమాద స్థాయికి పెరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మరో 4వేల క్యూసెక్కుల నీటిని కెనాల్ ద్వారా పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తున్నామన్నారు. ఇన్‌ఫ్లోస్ తగ్గితే దిగువకు నీటి విడుదల నిలిపివేస్తామని ఈఈ చెప్పారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

అల్లవరం తహశీల్దారుగా నరసింహారావు



అల్లవరం, ఆగస్టు 21: మండల తహసీల్దారుగా వీవీఎల్ నరసింహారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు నుంచి ఆయన బదిలీపై వచ్చారు. తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన నరసింహారావును ఎంపీడీవో కృష్ణమోహన్, ఆర్ఐ మేడిద దుర్గాశ్రీనివాస్, వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దారు సునీల్‌కుమార్ కాట్రేనికోనకు బదిలీపై వెళ్లారు.

మాలమహానాడు చేపట్టిన బంద్ ప్రశాంతం

- పాఠశాలలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు మూత
- రాజ్యాంగం ముద్దు అంటూ నినాదాలు






ముమ్మిడివరం, ఉప్పలగుప్తం, ద్రాక్షారామ, మామిడికుదురులలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాలమహానాడు చేపట్టిన బంద్ దృశ్యాలు

ముమ్మిడివరం, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు, జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. హోటల్స్, వర్తక, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాయాలు మూతపడ్డాయి. ఆర్టీసీ బస్సులు తిరగలేదు. మాలహానాడు ఉద్యోగ సంఘాల నాయకులు, జేఏసీ నాయకులు, కార్యకర్తలు అన్నంపల్లి టోల్ గేట్‌ను ముట్టడించి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. పల్లిపాలెం సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మానవహారం నిర్వహించారు. యువకులు మోటార్‌సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది వడ్డి నాగేశ్వరావు, కమిడి ప్రవీణ్‌కుమార్, కాశీ బాలమునికుమారి, దోనిపాటి ఆంజనేయులు, కాశి సింహాద్రివర్మ, పెయ్యల చిట్టిబాబు, ముంగండ ఆశీర్వాదం, యలమంచిలి బాలరాజు, జనిపల్లి సత్యనారాయణ, గోనమండ వెంకటేశ్వరరావు, నేరేడిమిల్లి అబ్బులు, దేవరపల్లి ఏడుకొండలు, కాశీ జగపతి, చీకురమిల్లి శ్రీనివాస్, కాశీ మూర్తి, మెండు కృష్ణబాబు, దాసరి రమణ, బొజ్జ బాలకృష్ణ, ఎస్సీ ఉద్యోగుల సంఘ, విశ్రాంత ఉద్యోగుల సంఘం, అంబేడ్కర్ యువజన సంఘాలు, అభ్యుదయ సంఘాలు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, కాంగ్రెస్ పార్టీ, వైసీపీ, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన భారత్‌బంద్ పి.గన్నవరంలో ప్రశాంతంగా ముగిసింది. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌లో భాగంగా తొలుత త్రీరోడ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ నిరసన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. అనంతరం బైక్ ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. ఎస్ఐ బి.శివకృష్ణ ఆధ్వర్యంలో త్రీరోడ్ సెంటర్, చాకలిపాలెం, పలు ప్రధాన కూడళ్లల్లో పోలీస్‌పికెట్ ఏర్పాటుచేసి పరిస్థితిని సమీ క్షించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి, కోట రామ్మోహనరావు, నక్కా వెంకటేశ్వరరావు, కోట విజ యభాస్కర్, యన్నాబత్తుల ఆనంద్, సాధనాల రమేష్, యన్నపు పెద్ద, కత్తుల విక్టర్, పుచ్చకాయల సత్యనారాయణ, పమ్మి అర్జునరావు, పుచ్చకాయల నరసింహమూర్తి, కోట రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మండపేట: మండపేట నియోజకవర్గంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వెంటపల్లి జాన్‌మార్క్ సారధ్యంలో మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు మండపేటలో దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మూయించి వేశారు. స్థానిక కరాచీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి మాలమహానాడు నాయకులు పోలిమాల సత్తిబాబు, గుమ్మిడి అనిల్‌కూమార్, యువకులు బైక్ ర్యాలీ నిర్వహించి కార్యాలయాలు మూయించి వేశారు. కేశవరంలో మాలమహానాడు నాయకుడు యండ్ల రవి సారధ్యంలో యువకులు గ్రామంలో దుకాణాలు, పాఠశాలలు, కోకోకోలా ఫ్యాక్టరీని మూయించి వేశారు. అనంతరం స్థానిక కెనాల్ రోడ్డుపై బైఠాయించారు. రాజమహేంద్రవరం - విశాఖ పాసింజర్ రైలు కేశవరంలో నిలపగా ఐదు నిమిషాలు రైలురోకో నిర్వహించి నిలుపుదల చేశారు. ఏడిదలో మాలమహానాడు నాయకుడు గంటా బాస్కరరావు సారధ్యంలో బంద్ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా మండపేట పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి, రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు. బస్సులు, ఆటోలు తిరగలేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అంబాజీపేట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మండలంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. మాలమహానాడు ఆధ్వర్యంలో పాఠశాలలు, విద్యాసంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేశారు. ముక్కామల సెంటర్ నుంచి అంబాజీపేట సెంటర్ వరకు మాలమహానాడు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం సెంటర్‌లో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురంలో మాలమహానాడు నాయకులు వాణిజ్యసంస్థలను మూయించివేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూయించివేశారు. ఆర్టీసీ బస్సులు మధ్యాహ్నం వరకు నిలిపివేశారు. కార్యక్రమంలో బుంగరాజు, అంబటి కృష్ణ, అంబటి తుకారాం, ఎంపీపీ ఇనకోటి శ్రీనివాస్, వెంటపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో మాలమహానాడు నాయకులు వాణిజ్య సంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలను మూయించివేశారు. యానాం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. సర్పంచ్ అంబటి తుకారాం, కాశి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మారెళ్ల భీమశంకరం, గుబ్బల శ్రీనివాస్, మాద్దా ఏడుకొండలు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ ఎత్తున మొహరించారు.

ఐ.పోలవరం: మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన బంద్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. పాత ఇంజరం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మాలమహానాడు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి మురమళ్ల వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు, వర్తకవాణిజ్య సంస్థలు మూసివేయించారు. మాలమహానాడు జిల్లా కార్యదర్శి రేవు శ్రీనివాస్, దుక్కిపాటి సత్యనారాయణ, కాశి పరివాజ్‌కుమార్, జనిపెల్ల విప్లవకుమార్, జనిపెల్ల గిరి, వడ్డి గౌతమ్, యలమంచిలి సురేష్, మట్ట గగనవీరుడు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని జైబీమ్ దళిత సంక్షేమ సేవా సంఘం నాయకులు అన్నారు. మండలంలో భారత్ బంద్ విజయవంతమైంది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వాణిజ్య దుకాణాలు మూతపడ్డాయి. కె.గంగవరం ప్రధాన కూడలిలో సుప్రీం తీర్పు వద్దు, రాజ్యాంగం ముద్దు అని జైబీమ్ దళిత సంక్షేమ సేవా సంఘం నాయకులు నినాదాలు చేశారు. ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. దళితసంక్షేమ సేవా సంఘం నాయకులు పెట్టా శ్రీనివాసరావు, తరపట్ల ఆనందరావు, బత్తుల అప్పారావు, ఇకనోటి శ్రీనివాస్, దారా సత్యనారాయణ, వెంటపల్లి నాని పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం మండలంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, మండలపరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాలను మూయించి బంద్ పాటించారు. కపిలేశ్వరపురంలో గ్రామసర్పంచ్, దళిత నాయకుడు సాకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌లో మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మామిడికుదురు: భారత్‌బంద్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. మాల పోరాట న్యాయ సమితి జేఏసీ నాయకులు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలను మూయించివేశారు. మాల పోరాట న్యాయ సమితి జేఏసీ నాయకులు మామిడికుదురు సెంటర్‌లో ప్రభుత్వానికి, సుప్రీం కోర్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కలిగితి పల్లంరాజు, నెల్లి దుర్గాప్రసాద్, బొంతు మణిరాజు, కొల్లాబత్తుల వెంకటరమణ, కోట బ్రహ్మానందం, కుసుమ పెరుమాళ్లకుమార్, పిల్లి శ్రీను, మట్టా సత్తిబాబు, మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. బుధవారం భారత్ బంద్ నిర్వహించడంతో ఆత్రేయపురం మండలంలోని 1 గ్రామాల నుంచి మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన గళం వినిపించారు.

ఉప్పలగుప్తం: ఎస్సీ వర్గీకరణకు నిరసనగా చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ సంస్థలు, విద్యాలయాలు, బ్యాంకులను మూసివేయించారు. చల్లపల్లి, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. గొల్లవిల్లి, సరిపల్లి సెంటర్లలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. ఆటోలు, ఇతర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో రోడ్లు నిర్మానుష్యమయ్యాయి. ఎస్.యానాం రవ్వ ప్లాంటు ప్రధాన ద్వారం వద్ద ఉద్యోగులను లోనికి వెళ్లకుండా నిరసనకారులు అడ్డుకున్నారు.

ఆలమూరు: మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. జేఏసీ నాయకుల అధ్వర్యంలో జరిగిన బంద్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలను మూసివేయించారు. ఆలమూరు, కొత్తూరు తదితర గ్రామాలలో వ్యాపార సంస్థలు, షాపులను మూసివేయించి బంద్ చేయించారు.

అల్లవరం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మండల మాలమహానాడు ఆధ్వర్యంలో మండలంలో బుధవారం బంద్ ప్రశాంతంగా జరిగింది. మాలమహానాడు ఆధ్వర్యంలో బెండమూర్లంక సెంటర్ నుంచి అల్లవరం మీదుగా వై.జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంతో నిరసన తెలిపారు. అల్లవరం, బెండమూర్లంక, దేవగుప్తం గ్రామాల్లో దుకాణాలు మూసివేశారు. కళాశాలలు, విద్యాసంస్థలు, బ్యాంకులు బంద్ కారణంగా మూతపడ్డాయి. కొనుకు బాపూజీ, నాతి శ్రీనివాసరావు, చింతా రామకృష్ణ, పరమట శ్రీను, సాధనాల శ్రీనివాస్, బళ్ల శ్యామ్ ఆధ్వర్యంలో ర్యాలీ, బంద్ ప్రశాంతంగా జరిగాయి.

రావులపాలెం: మండలంలో మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు వర్గీకరణ వద్దు, రాజ్యాంగం ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బంద్ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. దుకాణాలను మూసివేశారు.

రాయవరం: మండలంలో బంద్ బుధవారం ప్రశాతంగా సాగింది. రాయవరంలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో బంద్‌ను పాటింపజేశారు. ఈసందర్భంగా అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. బంద్ కారణంగా పలు ప్రైవేటు పాఠశాలలు ముందుగా సెలవు ప్రకటించగా పలు వ్యాపార సంస్థలు మూసివేసి బంద్‌కు సహకరించారు. కార్యక్రమంలో జైభీమ్ యూత్ సభ్యులు పోలిమాటి సుధాకర్, నేతల సురేష్, పాలింగి రాజు, కచ్చా రాజశేఖర్, విజయ్‌కుమార్, జిల్లెల నాగేశ్వరరావు, గండి చంద్రశేఖర్, గొల్లపల్లి అర్జునరావు పాల్గొన్నారు.

రాజోలు: మండలంలో బంద్ విజయవంతమైంది. జేఏసీ ఆధ్వర్యంలో మాలమహానాడు నాయకులు తెల్లవారుజామున మూడు గంటలకు రాజోలు బస్‌స్టాండ్, గ్యారేజుకు చేరుకుని ఆర్టీసీ బస్సులను బయటకు రాకుండా ఎన్‌హెచ్ 216పై బైఠాయించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, బ్యాంకులు ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. వర్గీకరణ వద్ద రాజ్యాంగం ముద్దు అంటూ నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు గొల్లపల్లి సూర్యారావు, రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు, పాము రాజేశ్వరదేవి మద్దతు తెలిపారు. జగడం సత్యనారాయణ, సరెళ్ళ విజయప్రసాద్, బత్తుల మురళీకృష్ణ, చింతా మధుకు మార్, ప్రసాద్, సర్పంచ్ వెంకటరామారావు, వైఎస్ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, జిళ్ళెళ్ల శ్రీనివాస్, వినోద్, విప్పర్తి సాయిబాబు, చిలకపాటి శ్రీధర్, కాకాడ విశ్వనాధం పాల్గొన్నారు.

కొత్తపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో బుధవారం కొత్తపేట మండలంలో బంద్ ప్రశాంతంగా సాగింది. ప్రైవేటు పాఠశాలలతో పాటు వ్యాపార సంస్థలు, పలు కార్యాలయాలను మూసివేశారు. మోటార్‌సైకిల్ ర్యాలీని నిర్వహించారు.

యానాం స్టోర్స్ ఎన్నిక ఏకగ్రీవం

యానాం, ఆగస్టు 21: యానాం కోపరేటివ్‌స్టోర్స్ లిమిటెడ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అభ్యర్థుల నామినేషన్ పత్రాలు పరిశీలన, తిరస్కరణ, ఉపసంహరణ అనంతరం 9మంది అభ్యర్థులకు 8మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని యానాం స్టోర్స్ ఎన్నికల అధికారి మహ్మద్ అబ్బుల్ రజాక్ ప్రకటనలో తెలిపారు. వీరిలో డైరెక్టర్లుగా జనరల్ కేటగిరిలో కోన సూర్యవతి, గెద్దం వేణు, లంక విద్య సాగర్, ధూళిపూడి మాధవ వెంకన్న, మల్లాడి తాతాజీ, ఎస్సీ కేటగిరిలో కమిడి విజయకుమార్ (న్యాయవాది), మహిళ విభాగంలో అంకాడి దేవి, పావులూరి మేరి గ్రేస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారు త్వరలో సమావేశం నిర్వహించుకుని అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి తదితర పదవులను ఎన్నుకుంటారు. అయితే మిగిలిన ఒక్క నామినేషన్ ఎస్సీ విభాగంతో యాళ్ల మీరయ్య దాఖలు చేసినప్పటికి కులధ్రువీకరణపై అభ్యంతరం ఉండటంతో త్వరలో ప్రకటిస్తారని తెలిసింది.ఎన్నికైన వారిలో 99శాతం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్యానల్ కావడంతో మల్లాడి ఇంటి వద్ద అభిమానులు, నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.

ఆ ప్రచారంలో వాస్తవం లేదు

ముమ్మిడివరం, ఆగస్టు 21: ఓఎన్జీసీ సంస్థ ద్వారా మత్స్యకారులకు చెల్లించాల్సిన నష్టపరిహారం అందించేందుకు సీఎం చంద్రబాబునాయుడు ఈనెల 27వ తేదీన మురముళ్లకు విచ్చేస్తున్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లింపుపై ఓఎన్జీసీ సంస్థతో చర్చలు కొనసాగుతున్నాయన్నారు.

వెంకన్న ఆదాయం రూ.1.89లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 21: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,89,736 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

23నుంచి ఉపాధి గ్రామసభలు

ఆత్రేయపురం, ఆగస్టు 21: మండలంలోని 17గ్రామాల్లో ఈనెల23 నుంచి ఎన్ఆర్ఈజీఎస్ ప్రత్యేక గ్రామసభలు విజయవంతం చేయాలని ఎంపీడీవో నాతి బుజ్జి పేర్కొన్నారు. బుధవారం మండల పరషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా గ్రామసభల షెడ్యూల్‌ను వివరించారు. ఈసభల్లో వివిధశాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రాయవరం, ఆగస్టు 21: మాచవరానికి చెందిన మలకా కిరణ్‌కుమార్ మరణించగా ఆయన తండ్రి మలకా అప్పారావును బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. పసలపూడికి చెందిన కర్రి మంగోజీ, బీరక రాఘవ ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆయా గ్రామాల టీడీపీ నేతలు ఉన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

మామిడికుదురు, ఆగస్టు 21: లూటుకుర్రులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన బాధిత కుటుంబాలకు నిత్యావసరాలను సర్పంచ్ అడబాల తాతకాపు పంపిణీ చేశారు. విళ్ల సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం

- ఒక్కో కుటుంబానికి రూ.10లక్షలు మంజూరు
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం



ఫైల్ ఫొటో

పి.గన్నవరం, ఆగస్టు 21: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం మే 14న ఉడిమూడి శివారు చింతావారిపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు కూలీలు మృతి చెందారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. చింతావారిపేట వద్ద మే 14వ తేదీ రాత్రి ట్రాక్టర్‌లో కూలీలు ధాన్యం లోడింగ్ చేసి తాళ్లు కడుతుండగా వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. కూలీలు చిలకపూడి మణిబాబు, నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యప్రకాష్, ఈరి కట్టయ్యలు అక్కడికక్కడే మృతిచెందారు. మరో యువకుడు చిలకలపూడి సురేష్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతిచెందిన చిలకలపూడి మణిబాబు, చిలకలపూడి సురేష్‌లు సోదరులు. ఈప్రమాదంలో ఐదుగురు కూలీలతో పాటు ఆర్టీసీ కండక్టర్ కూడా మృతిచెందారు. ఆ సమయంలో బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు, కుటుంబీకులు రోడ్డుపై బైఠాయించారు. జిల్లా, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులతో పాటు అప్పటి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం వచ్చేలా కృషిచేస్తామని హామీఇచ్చారు. అంతేకాకుండా రూ.లక్షచొప్పున సాయం చేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చొరవచూపి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడారు. దీంతో ఒక్కో కుటుంబానికి రూ.10లక్షలు మంజూరయ్యాయని, కలెక్టర్ కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే బాధితకుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బాధితకుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఆర్థికసాయం మంజూరు చేయడంపై హర్షం వ్యక్తమవుతోంది.

పిల్లల సంరక్షణ కేంద్రాల పరిశీలన



అమలాపురం రూరల్, ఆగస్టు 21: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు బుధవారం అమలాపురం పట్టణం పరిసర ప్రాంతాల్లో ఉన్న పిల్లల సంరక్షణ కేంద్రాలను జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి ఎం.ఝాన్సీరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమలాపురం పట్టణంలోని కామాక్షి ప్రేమ మందిరం, కొంకాపల్లిలోని హరి మనో వికాస కేంద్రాలను సందర్శించారు. లైసెన్సింగ్ యాక్టు ప్రకారం ఆయా కేంద్రాలు రిజిస్టర్ అయ్యాయా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. ఆయా కేంద్రాల్లోని చిన్నారులు, విద్యార్థినులు, దివ్యాంగులతో ఆమె మాట్లాడారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు అందించే భోజనాలను పరిశీలించారు. ఆయా సంస్థల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వం లక్ష్యం



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన ఎమ్మెల్యే బండారు, నాయకులు

రావులపాలెం, ఆగస్టు 21: గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు సైతం ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం శ్రీసత్యసాయి విద్యాసంస్థల్లో టీడీపీ యువ నాయకుడు బండారు సంజీవ్ ఆధ్వర్యంలో బుధవారం వికాస మెగా జాబ్‌మేళా నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు పాల్గొని నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉద్యోగ, ఉపాధి కల్పన పూర్తిగా కుంటి పడటంతో నిరుద్యోగం పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో ప్రభుత్వ ప్రైవేటు సెక్టార్లతో కలిపి 20లక్షల ఉద్యోగల కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. టీడీపీ నాయకులు బండారు సంజీవ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణలతో కలిసి ఎమ్మెల్యే బండారు అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, జిల్లా మేనేజర్ జి.రమేష్ మాట్లాడుతూ ఈజాబ్‌మేళాకు 1813మంది నిరుద్యోగులు హాజరయ్యారన్నారు. 42కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఎంపిక ప్రక్రియ చేపట్టగా 711మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. జాబ్‌మేళాను దగ్గర ఉండి పరివేక్షించిన యువ నాయకులు బండారు సంజీవ్‌ను అభినందించారు. వేదికపై నాయకులు సమక్షంలో బండారు సంజీవ్ పుట్టినరోజు కేక్‌ను కట్ చేశారు. నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముదునూరి వెంకటరాజు, చిలువూరి సతీష్‌రాజు, కరుటూరి నరసింహారావు, ధర్నాల రామకృష్ణ, ఈదల నల్లబాబు, మైగాపుల గురవయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చిరు అభిమానులు

అమలాపురం టౌన్, ఆగస్టు 21: చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బుధవారం మెగా అభిమానులు అమలాపురంలో పలు చోట్ల మొక్కలు నాటారు. రవణంవీధిలోని ఓంశాంతి కేంద్రం పక్కన పార్కుతో పాటు పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, జాతీయ ఉపాధ్యక్షుడు ఏడిద శ్రీను, మెగా ఫ్యాన్స్ ప్రతినిధులు నల్లా నాయుడు, వర్రే శేషు, దాట్ల బాబు, ఆచంట శ్రీను, చింతపల్లి చిన్నా, రవణం చిట్టిబాబు, చిక్కం కిట్టు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం అమలులో ప్రభుత్వాలు విఫలం

ఆత్రేయపురం, ఆగస్టు21: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగావిఫలమైనట్లు పారా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సాకా రాజారావు పేర్కొన్నారు. బుధవారం ఆత్రేయపురం మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉపాధి మేట్లతో సమావేశం నిర్వహించారు. 100రోజులు పనిదినాలు కల్పించడంలేదని, వేతనాలలో కోతలు, నెలలు గడుస్తున్నా నగదు చెల్లింపులు సక్రమంగా జరగడం లేదన్నారు.

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



జితేంద్ర, నాని

అమలాపురంరూరల్, ఆగస్టు21: ఇందుపల్లిజడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు ఇరువురు రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వి.నరసింహారావు తెలిపారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న జల్లి జితేంద్రదొర, కడిమి నానీలు ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 74,56కిలోల విభాగంలో సబ్ జూనియర్స్ టైటిల్ సాధించి విజేతలుగా నిలిచారు. సెప్టెంబరు 13,14తేదీల్లో అమలాపురంలో జరిగే రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: మిస్టర్ బచ్చన్
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: డబుల్ ఇస్మార్ట్
శేఖర్ స్క్రీన్-2	: వేద
రమా	: ఆయ్
గణపతి	: రాయన్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: డబుల్ ఇస్మార్ట్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: తంగలాన్

పంచాయతీలకు నిధుల విడుదలపై హర్షం

అల్లవరం, ఆగస్టు 21: గ్రామపంచాయతీలకు నిధులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మండల సర్పంచ్‌ల సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, దాకారపు చిరంజీవి, నడింపల్లి సుబ్బరాజు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, చిట్నీడి శ్రీదేవి, రొక్కాల విజయలక్ష్మి, తోట శ్రీదేవి హర్షం వ్యక్తం చేశారు.

తాపేశ్వరంలో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన



మండపేట, ఆగస్టు 21: తాపేశ్వరంలో బుధవారం మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.ఆనందకుమార్, ఎం.సుధారాణి పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు దృష్ట్యా రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. వరిలో వచ్చే కాండం తొలుచే పురుగు, ఆకుముడత, ఎండు తెగులు నివారణకు తీసుకోవల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. నత్రజని, యూరియా మోతాదుకు మించి వాడితే కలిగే నష్టం గురించి వివరించారు. పొటాష్ చిరుపొట్ట దశలో ఎకరాకు 15కిలోలు వాడాలన్నారు. రైతులు వరి చేనుకు వాడే మందులను పరిశీలించి పలుసూచనలు చేశారు. వారి వెంట స్థానిక మండల వ్యవసాయాధికారి కె.యేసుబాబు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నిలిచిన సీబీఎస్ఈ ఆన్‌లైన్ పరీక్ష

ఉప్పలగుప్తం, ఆగస్టు 21: గొల్లవిల్లి హైస్కూల్లో బుధవారం జరగాల్సిన సీబీఎస్ఈ ఆన్‌లైన్ పరీక్ష బంద్ కారణంగా నిలిచిపోయింది. 164మంది విద్యార్థులు నిరాశతో వెనుదిరిగారు. గొల్లవిల్లి హైస్కూల్ హెచ్ఎం లంక రాణి ఇతర విద్యార్థులను పంపించి, కేవలం సీబీఎస్ఈ ఆన్‌లైన్ పరీక్షలకు హాజరయ్యే వారిని మాత్రమే పాఠశాలలో ఉంచేలా ఉదయం బంద్ నిర్వాహకులతో మాట్లాడారు. మధ్యాహ్నం పరీక్ష కావడంతో విద్యార్థులు స్కూల్‌లోనే ఉండిపోయారు. ఈసమయంలో అధిక సంఖ్యలో వచ్చిన ఆందోళనకారులు బంద్ పాటించాలని హెచ్ఎంను కోరారు. ఈదశలో హెచ్ఎం, ఉద్యమకారుల మధ్య కొద్దిసేపు చర్చలు జరిగాయి. అయినప్పటికీ ఆందోళనకారులు ససేమిరా అనడంతో హెచ్ఎం రాణి డీఈవో కమలకుమారికి ఫోన్‌లో పరిస్థితి వివరించారు. డీఈవో ఆన్‌లైన పరీక్షకు అవకాశం ఇవ్వాలంటూ చేసిన అభ్యర్థనను కూడా నిరసనకారులు తిరస్కరించారు. దీంతో చేసేదేమిలేక విద్యార్థులు పరీక్ష రాయకుండానే ఇళ్లకు వెళ్లిపోయారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 21: స్థానిక శీలంవారి సావరంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర పనులు కోసం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ కె.విజయానంద్ తెలిపారు. శీలంవారి సావరం, వైఎస్ఆర్‌నగర్, రైలు గట్టు, బీర్ ఫ్యాక్టరీ, వెల్ల వాటర్‌వర్క్సు, బ్రాడీపేట, సాయినగర్, తోటవారివీధి ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

కనకదుర్గ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



చొప్పెల్లలో నిర్మించిన ఆలయంలో విగ్రహాలకు సంప్రోక్షణ చేస్తున్న దృశ్యం

ఆలమూరు, ఆగస్టు 21: చొప్పెల్ల వద్ద జాతీయ రహదారికి పక్కన నూతనంగా నిర్మించిన కనకదుర్గ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ కాళ్లకూరి కాశీశేఖర్‌బాబుశర్మ అధ్వర్యంలో వేదపండితులు ముందుగా విగ్రహాలకు సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. చొప్పెల్ల నాయకులు మెర్ల గోపాలస్వామి సత్యవతి దంపతులు, జాంప్రోలు వెంకట్రావు ఆదిలక్ష్మి, జాంప్రోలు నాగేశ్వరరావు రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఉదయం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటులో 27మంది మిగులు

కె.గంగవరం, ఆగస్టు 21: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో భాగంగా కె.గంగవరంలో బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. మండలంలో 27మంది మిగులు ఉపాధ్యాయులను గుర్తించారు. వీరిలో ఆరుగుర్ని మండలంలోని పాఠశాలలకు సర్దుబాటు చేశామని, మిగిలిన వారిని డివిజనల్ పూల్‌కు పంపిస్తామని ఎంఈవో ఏ. నాగరాజు చెప్పారు.

చేనేత సంఘాలతో టాటా తనైరా ఒప్పందం

అయినవిల్లి, ఆగస్టు 21: జిల్లాలోని చేనేత సహకార సంఘాలతో టాటా తనైరా సంస్థ ఒప్పందం చేసుకున్నట్టు చేనేత, జౌళిశాఖ అధికారి ఎం.రాజు తెలిపారు. కె.జగన్నాథపురంలో బుధవారం జిల్లాలోని చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంపొందించడం, వస్త్రాల కొనుగోళ్లు, ఉత్పత్తిలో తీసుకోవలసిన జాగ్రత్తలను ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ అంకం వీర్రాజు, హసన్‌బాద చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యప్రకాష్, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉమ్మెకుల్సుమ్‌కు ఘన నివాళి

ద్రాక్షారామ, ఆగస్టు 21: ఇమామ్ హుస్సేన్ రెండో కుమార్తె బీబీ ఉమ్మెకుల్సుమ్ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం ముస్లింలు ఘన నివాళులర్పించారు. మత గురువు మౌలానా సయ్యద్‌షబాబ్ హైదర్ మజిలీస్ ఆలపించారు. పంజా నుంచి పీరును గుర్రంపై ఊరేగించారు.

కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పంచాయతీలు బలోపేతం

ముమ్మిడివరం, ఆగస్టు21: కూటమిప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి తీసుకున్న నిర్ణయానికి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవులకు ముమ్మిడివరం నియోజకవర్గ గ్రామ సర్పంచ్‌ల సమైఖ్య అధ్యక్షుడు గొలకోటి దొరబాబు కృతజ్ఞతలు తెలిపారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాటాడారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో పంచా యతీ వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. 15వ ఆర్థికసంఘం నిధులతో కరెంటు బిల్లులు, ఇతర వాటికి వినియోగించి పంచాయితీల అభివృద్ధిని నాశనం చేశారన్నారు. పంచాయతీలకు, గ్రామసర్పంచ్‌లకు పూర్వపు వైభవం తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 15వఆర్థిక సంఘం నిధులతో ఎమ్మెల్యేతో మమేకమై ఎంజీఎన్ ఆర్‌సీఎస్ నిధులు మ్యాచింగ్ గ్రాంట్లతో రోడ్లు, డ్రైన్ల పనులు చేపట్టి ప్రజలకు ఉపయోగపడేలా సర్పంచ్‌లు కృషి చేయాలన్నారు.

రేపు జాతీయ అంతరిక్ష దినోత్సవం

అమలాపురం రూరల్, ఆగస్టు 21: వన్నె చింతలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల23న రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం జిల్లాస్థాయిలో నిర్వహించనున్నట్లు డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. అంతరిక్ష యాత్రలో భారతదేశం పాత్ర, అంతరిక్ష ప్రయాణంలో ఎదుర్కొనే సమస్యలు సాధించిన విజయాలపై ఇస్రో మాజీ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం భారతదేశం అంతరిక్ష యాత్ర ప్రపంచ అభివృద్ధిలో మన పాత్ర అనే అంశపై విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక్కో విద్యార్థి భారతదేశ అంతరిక్ష యాత్రపై మాట్లాడిన ఒక్క నిమిషంవీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్‌చేసి 22వ తేదీ సాయంత్రంలోగా జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యంకు పంపించాలన్నారు.

బాధిత కుటుంబాలకు మల్లాడి పరామర్శ

యానాం, ఆగస్టు 21: బాధిత కుటుంబాలను బుధవారం ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. పితృవియోగంతో బాధపడుతున్న కనకాలపేటకు చెందిన నిమ్మకాయ శ్రీనువాస్‌ను మల్లాడి పరామర్శించారు. గిరియంపేటలో దోమా నారాయణ అనారోగ్యంతో, జి.ఎన్.నాయుడు కాలనీలో గరికపర్తి వి.ఎస్.ఎస్.కోటేశ్వరరావు గుండెపోటులో మృతిచెందాడు. నారాయణ, కోటేశ్వరరావు మృతదేహాలకు మల్లాడి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు మల్లాడి సానుభూతి తెలిపారు.

ఘనంగా బండారు సంజీవ్ జన్మదిన వేడుకలు

ఆత్రేయపురం, ఆగస్టు 21: కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు, యువనేత బండారు సంజీవ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు స్వగృహంలో జరిగిన వేడుకల్లో యువనేత సంజీవ్ పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో పుట్టినరోజు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.